

# కళకు కీర్తి.. కొండపల్లి బొమ్మకు కొత్త ఊపిరి

- కొండపల్లి బొమ్మల కళకు వన్నె తెచ్చేలా ఉత్సవాలు
- కళాకారుల సంక్షేమానికి సమష్టిగా పెద్దపీట
- ఏటా అంబరాన్ని తాకేలా మూడు రోజుల పాటు ఉత్సవాలు
- కొండపల్లి ఖిల్లా అభివృద్ధికీ ప్రభుత్వం ప్రత్యేక కృషి
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్
- 250 మంది కళాకారుల ప్రదర్శనతో ఆకట్టుకున్న కొండపల్లి కార్నివాల్



విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్తప్రతినిధి: శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మ కళకు కీర్తి.. కళాకారులకు కొత్త ఊపిరినిచ్చేలా కొండపల్లి బొమ్మల పండగను నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కొండపల్లి బొమ్మల ప్రాచీన కళకు మరింత ప్రాచుర్యం కల్పించాలనే లక్ష్యంతో కొండపల్లిలో జరుగుతున్న కొండపల్లి బొమ్మల పండగ రెండో రోజు ఆదివారం సాయంత్రం నిర్వహించిన మెగా హెరిటేజ్ కార్నివాల్ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది కళాకారులు, కొండపల్లి బొమ్మల హస్తకళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. డప్పు, పులి వేషాలు, తప్పెటగుళ్లు, థింసా, గరగలు, కీలు గుర్రాలు.. ఇలా 12 రకాల సంప్రదాయ కళల కళాకారుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైన ఈ కార్యక్రమం ఆద్యంతం కళా సాంస్కృతిక సంబరమై వాహ్ అనిపించింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కొండపల్లి అందమైన ప్రాంతం కొండపల్లి బొమ్మ మరింత అందమైన సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని.. ఈ కళను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాజధానికి ముఖద్వారంగా ఉన్న ప్రాంతం లోని కొండపల్లి ఖిల్లాను కూడా పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని ముఖ్యమంత్రి దిశానిర్దేశంతో త్వరలో ప్రత్యేక కార్యాచరణతో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ మాట్లాడుతూ కొండపల్లి బొమ్మ అలనాటి రాజుల సాంస్కృతిక కళా పోషణకు ప్రతీక అని.. రాచరికం పోయినా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆ బొమ్మ వైభవం వర్ధిల్లుతోందని, ఈ వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో ఈ పండగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఖిల్లాపై లేజర్ షో ప్రారంభమయ్యేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కొండపల్లి బొమ్మను లోకల్ బ్రాండ్ నుంచి గ్లోబల్ హెరిటేజ్ బ్రాండ్ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా చేస్తున్న కృషిలో భాగంగా ఈ పండగను నిర్వహించడం జరుగుతోందని.. ఈ బృహత్తర కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ అన్ని విధాలా సహాయ సహకారాలు అందించనున్నట్లు రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. ఎక్కడా లేని విధంగా కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతంతో పాటు కొండపల్లి బొమ్మ ఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తేజస్వి పేర్కొన్నారు. కార్నివాల్‌లో కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, స్థానిక నాయకులు సీతా రామయ్య, రామ్మోహనరావు (గాంధీ), రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ఛైర్మన్ సూర్యప్రకాశ్, సొసైటీ ప్రతినిధులు, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు బంధాలు, మానవ సంబంధాలు డిలిట్ చేసుకునే అంశాలుగా మారిపోతున్నాయి

- అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: సెల్ ఫోన్‌లో అవసరం లేనివాటిని డెలిట్ చేసుకున్నట్టే నేడు బంధాలు, మానవ సంబంధాలు డెలిట్ చేసుకునే అంశాలుగా మారిపోతున్నాయని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ సౌజన్యంతో మల్లెతీగ నిర్వహణలో ఆదివారం మురుగుడు శ్రీహరి రచించిన శ్రీహరి సిత్రాలు ఛాయాచిత్ర కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభకు పెనుగొండ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేళ్ల అనుబంధాలను క్షణాల్లో తెంపుకుంటున్న తీరును ఈ పుస్తకంలో రచయిత ఖితెగిపోతున్న బంధాలుఖి పేరుతో కవిత్వం చేయడం నేటి సమాజ తీరుతెన్నుల్ని కళ్ళకు కట్టిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా. పట్టాభి కళాపీఠం వ్యవస్థాపకులు డా. తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సిరాచుక్క మౌనం వహిస్తే, సారాచుక్క రాజ్యం ఏలుతుందన్నారు. అందుకే కవులు మౌనం వీడి, సామాజిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కవిత్వం రాయాలన్నారు. మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఎన్నో కొత్త ప్రక్రియలు రంగప్రవేశం చేస్తున్నాయన్నారు. ఛాయాచిత్ర కవిత్వం అనే కొత్త ప్రక్రియతో కవిత్వమై పుస్తకంగా మనముందుకొచ్చిన శ్రీహరిని ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమన్నారు. వివిఐటి విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగం సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ తెలుగుభాషను రక్షిస్తున్నవారిలో కవులే అగ్రభాగాన నిలుస్తారన్నారు. అందుకు కవులంటే నాకు చాలా ఇష్టమన్నారు. సుప్రసిద్ధ కవి కోసూరి రవికుమార్ పుస్తకాన్ని సమీక్షిస్తూ పుస్తక రచయిత శ్రీహరి అంతరాత్మను, పుస్తకంలోని ఆత్మను సభకు పరిచయం చేశారు. రచయిత శ్రీహరి తన స్పందన తెలియజేస్తూ తొలి పుస్తకంతోనే తనను అభిమానిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సభలో ఆధ్యాత్మిక రచయిత పచ్చిపులుసు సూర్య నారాయణ, బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బండికల్లు జమదగ్ని, నాటక రచయిత కావూరు సత్యనారాయణ, గుళ్ళపల్లి రాఘవేంద్రరావు, గుళ్ళపల్లి

# నాలుగు రోజుల్లో ముగ్గురు మిస్సింగ్?!

- ఇద్దరు వివాహితలు, విద్యార్థిని ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు



నాగవేణి (ఫైల్ ఫోటో)



సావిత్రి (ఫైల్ ఫోటో)



శ్రీజకుమారి (ఫైల్ ఫోటో)

అనంతపురం క్రైమ్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త: కేవలం నాలుగు రోజుల వ్యవధిలో అనంతపురం నగరంలో ముగ్గురు మహిళలు అదృశమయ్యారు. వీరిలో ఇద్దరు వివాహితులు కాగా, ఇంటర్ చదివే విద్యార్థిని కావడం గమనార్హం. వారి జాడ కోసం బాధితులు పరిసర ప్రాంతాల్లో, బంధు మిత్రుల్లో ఎంత గాలించిన వారి ఆచూకీ లభించలేదు. చివరకు చేసేది లేక పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాల్సిన దుస్థితి దాపురించింది. అయితే పోలీసులకు మాత్రం తలపోటుగా మారింది.

వివరాల్లోకి వెళితే.. ఈనెల 13న గుంతకల్ పట్టణ నివాసి కమ్మర నాగవేణి అనే వివాహిత మిస్సింగ్ అయింది. ఈ నెల 12న అనారోగ్య కారణాలతో స్థానిక సర్వజన ఆసుపత్రికి కుమారుడుతో కలిసి వచ్చింది. ఆమెకు మతి స్థిమితము సరిగాలేదు. మరుసటి రోజు 13న మధ్యాహ్నం తన కొడుకు లేని సమయంలో అదృశ్యమైందని బాధితుడు వాపోయాడు. తన తల్లి ఆచూకీ కనిపెట్టాలంటూ టూ టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. అదేరోజు మరో మహిళ అదృశ్యం అయింది. నగరంలోని నాయక్ నగర్ నివాసి మావిళ్ళ సావిత్రి తెల్లవారు జామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయినదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. మళ్ళీ రెండు రోజులు గడవకనే మరో ఇంటర్ చదివే విద్యార్థిని మిస్సింగ్ అయింది. ఈనెల 16 న నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని షిరిడి నగర్ కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని గొల్లపల్లి శ్రీజ కుమారి అదృశ్యం అయింది. సెకండియర్ ఫెయిల్ అయినదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆచూకీ తెలపాలంటూ బాధితులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణే మా లక్ష్యం

- తిరుపతి జిల్లా కార్యాలయం త్వరలో పూర్తి
- ఎన్‌జిఓ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



తిరుపతి, ఏప్రిల్ 19 ప్రభాతవార్తప్రతినిధి: ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమని ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. గత దశాబ్ద కాలంగా నిలిచిపోయిన తిరుపతి పట్టణ ఎన్జీఒ భవన పునర్నిర్మాణానికి నరసింహ తీర్థం రోడ్డులో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఎన్జీఒ భవన పునర్నిర్మాణానికి రాష్ట్ర సంఘం తరఫున ఐదు లక్షల విరాళాన్ని ఇస్తున్నామన్నారు. ఉద్యోగ సంఘ నాయకులుగా తాము వేసే ప్రతి అడుగు సమస్యల పరిష్కారం, ఉద్యోగుల ప్రయోజనాల దిశగా వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతన సవరణ కమిటీని నియమించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న ధరల దృష్ట్యా వేతన సవరణ కమిటీని ఆలస్యం చేయకుండా వెంటనే నియమించి ఉద్యోగుల వేతనాలను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వంనుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలతో పాటు డిమాండ్ల సాధనలో వెనకడుగు ఉండబోదన్నారు. డీఏ అరియర్స్, సీపీఎస్ ఉద్యోగుల బకాయిల చెల్లింపులో కొంత పురోగతి ఉందన్నారు. ప్రధానంగా 2023 జూలై నెలలో నియమించాల్సిన వేతన సవరణ కమిటీ (పి.ఆర్.సి.) ఛైర్మన్ నియామకంలో జాప్యం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి నిరంతరం తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన 33వేల కోట్ల రూపాయల పైచిలుకు బకాయిలలో ప్రస్తుత ప్రభుత్వం 22 వేల కోట్ల రూపాయలు దశలవారీగా చెల్లించిందని గుర్తు చేశారు. ఈ నెలలో 7వేల కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం చెల్లించడం సంతోషదాయకమని తెలిపారు. సర్వీస్ లో ఉన్న ఉద్యోగులకు సరెండర్ లీవ్ బకాయిల మీద ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రానికి సొంత భవనం నిర్మించుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు రాష్ట్ర సంఘం అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు స్వేచ్ఛాయుత వాతావరణ ఉందని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రజాస్వామ్యతంగా తెలిపే వాతావరణం నెలకొని ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు గురుకుల సొసైటీ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 పెంచే విషయమై, 11వేల మంది ఉద్యోగులను సిపిఎస్ లో నుంచి ఓపిఎస్ లోకి తీసుకొచ్చే అంశం, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అంశం, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్స్ అంశం, పెన్షనర్లకు ఎడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించే అంశం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పదవి విరమణ పెంపు ప్రభుత్వ పథకాల వర్తింపు వంటి అంశాలలో రాష్ట్ర ఎన్జీఒ సంఘం నిరంతరం తన ప్రయత్నాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.వి రమణ , జిల్లా అధ్యక్షుడు ఎస్. సురేష్ బాబు, కార్యదర్శి సురేంద్ర, కోశాధికారి కోటేశ్వరరావు, సహాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్ రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు బొప్పన లలిత కుమార్, జేఏసీ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి రైల్లో దోపిడీ దొంగల హల్ చల్

- కత్తులతో బెదిరించి 120 గ్రాముల బంగారం దోచేసిన దుండగులు
- బాపట్ల జిల్లా అప్పికట్ల వద్ద బెంగళూరు- నరసాపురం రైల్లో ఘటన



గుంటూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: శనివారం అర్ధరాత్రి రైల్లో దారిదోపిడి జరిగిన ఘటన కలకలం రేపింది. ప్రయాణికులను కత్తులతో బెదిరించి 120 గ్రాముల బంగారం, 10 గ్రాముల వెండి వస్తువులను దుండగులు ఎత్తుకెళ్లారు. బెంగళూరు నుండి నరసాపురం వెళ్లే ట్రైన్ నం 07154 స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలు ప్రతి శనివారం ఉదయం 11:00 గంటలకు బెంగళూరులో ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 06:00 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. గుంటూరు రైల్వే డీఎస్పీ పి. అక్కేశ్వర రావు కథనం ప్రకారం శనివారం అర్ధరాత్రి గం1.45 ల నుండి గం1.55 ల మధ్య బాపట్ల జిల్లా అప్పికట్ల, గుడిపాడు మధ్య బెంగళూరు, నరసాపురం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో దోపిడీ జరిగిందని తెలిపారు. సుమారు 6 నుండి 9 మంది దుండగులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మొదటగా ఏ1 కోచ్‌లో చైన్ లాగి రైలును నిలిపిన దుండగులు ఎస్7, ఎస్11, ఎస్12, ఎస్13, ఎస్14 బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు. ప్రయాణికులను కత్తులతో బెదిరించి కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే 5 గురి వద్ద నుండి 120 గ్రాముల 4 బంగారు గొలుసులు, 10 గ్రాముల వెండి చైన్‌లను దుండగులు ఎత్తుకెళ్లారు. దోపిడీ సమాచారం అందిన వెంటనే రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితులు తెనాలి, విజయవాడ, నరసాపురం, కాకినాడకు చెందిన వారుగా రైల్వే పోలీసులు తెలిపారు. బాధితుల నుండి వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు తీసుకొని కేసులు నమోదు చేసినట్లు గుంటూరు రైల్వే డీఎస్పీ తెలిపారు. ఘటన పై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, దుండగులను త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు.



# కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద మృతి

- కుటుంబ సభ్యుల్లో ఆగ్రహం

బనగానపల్లె, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు బెలుం సింగవరం గ్రామానికి చెందిన దొమ్మరి వెంకట సుబ్బయ్య (38)గా గుర్తించారు. ట్రాక్టర్ చోరీ కేసులో భాగంగా కొలిమిగుండ్ల పోలీసులు నిన్న ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే రాత్రి సమయంలో పోలీస్ స్టేషన్‌లోనే వెంకట సుబ్బయ్య మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆవుకు ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు. ఈ ఘటనపై మృతుని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకట సుబ్బయ్య మృతి పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కొలిమిగుండ్ల సీఐ వివరణ మేరకు చోరీ కేసులో అరెస్ట్ అయిన ముద్దాయి తెల్లవారుజామున 3 గంటలకు బాత్రూంకు అని పోయి ఉరి వేసుకోవడం జరిగిందని ఈ విషయం అతనితో చోరీతో పాల్గొన్న తేజ గమనించి అక్కడ ఉన్న సెంట్రీకి చెప్పారు మృతిని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు మాకు ఎటువంటి అనుమానం లేదు నా భర్త మనస్థాపనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



# డిసిఎం పవన్ ఆరోగ్యంగా కోలుకోవాలి

- తిరుపతిలో జనసేన నేతల పూజలు

తిరుపతి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని తిరుపతిలో ఆదివారం ఉదయం జనసేన ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పూజలు చేయించారు. తిరుపతి బైరాగిపట్టెడలోని అభయఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్‌కల్యాణ్ పేరున అర్చనలు జరిపించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర అస్వస్థత కు గురై నిన్నటి రోజున ఆయనకి సర్జరీ చేయడం జరిగింది. ఆయన త్వరగా కోలుకోవాలని పవన్ కళ్యాణ్, మళ్ళీ ప్రజా సేవలో ఈ రాష్ట్రానికే కాదు దేశ రాజకీయాలలో మరింత వేగంగా ప్రజా శ్రేయస్సు లో నిమగ్నం అవ్వాలని ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టినట్లు ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్,రుద్ర కిషోర్,ఆది, రాజేంద్ర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలలో పనిచేసే ఆయా, వాచ్‌మెన్, మిడ్ డే మీల్స్

# కార్మికుల సమస్యల పరిష్కరించాలి

- ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ధర్నా

విజయవాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయా, మిడ్ డే మీల్స్ వాచ్మెన్‌గా పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్ యు ఆధ్వర్యంలో విజయవాడ అలంకార్ ధర్నా చౌక్ లో ఆదివారం ధర్నా నిర్వహించారు. వారి సమస్యపై పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ప్లే కార్డులు ప్రదర్శించారు. రోజుకి 200 రూపాయలకు 8గంటలు పనిచేయడం సిగ్గు సిగ్గు, మా సమస్యలపై నిర్లక్ష్యమ్లా మంత్రి లోకేష్‌స్పందించండి. మరుగుదొడ్లు బాత్రూమ్స్ రోజుకు మూడుసార్లు క్లీన్ చేస్తూ విద్యార్థుల ఆరోగ్యంగా చూసుకునే మాకు 200 రూపాయలు ఇస్తారా తక్షణమే స్పందించాలి. 10 సంవత్సరాలు పనిచేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ మాట్లాడుతూ 41 వేల ప్రభుత్వ పాఠశాలలో 50 వేల మంది ఆయాలు, వాచ్ మెన్, మరో లక్ష మంది మిడ్ డే మిల్స్ కార్మికులు పని చేస్తున్నారు. రోజుకి మూడు సార్లు మరుగుదొడ్లు టాయిలెట్స్ క్లీనింగ్ చేసేందుకు ప్రభుత్వం 200 రూపాయలు ఇవ్వటం బాధాకరం. ఈ జీతానికి ఎనిమిది గంటలు పని చేయటం అంటే వారి శ్రమని ప్రభుత్వం గుర్తించక పోవడమే అని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రోజు కూలి 783 రూపాయలుగా నిర్ణయిస్తే ఆ ప్రకారం చూసుకున్న 24 వేల రూపాయలు ఇవ్వాలి. కానీ 15000 జీతం ఇవ్వాలని ఆయా వర్కులు డిమాండ్ చేస్తున్నారు అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతున్న మిడ్ డే మీల్స్ వర్కర్స్ కి మెనూ పెంచకపోవడం వారికి ఇచ్చే అలవెన్స్ 3000 రూపాయలు కూడా రెగ్యులర్గా ఇవ్వకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సైతం కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన ప్రభుత్వాలకు చలనం లేకపోవడం దురదృష్టకరం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ మనిషిని పెట్టేందుకు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. 20 సంవత్సరాలు పని చేసిన కార్మికులను నిర్దాక్షిణ్యంగా రాజకీయ ఒత్తిడి వల్ల తొలగించే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం వారి సమస్యలను పరిశీలించి పరిష్కారం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.వి. రమణ జి. హరికృష్ణారెడ్డి, ఆయా వర్కర్ల జిల్లా నాయకులు కోనేరు లక్ష్మీ, కౌశల్య, కొప్పుల కుమార్, మిరావాలి, పిడబ్ల్యు నగర అధ్యక్షురాలు ఆసియా మాట్లడుతూ వారి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గుత్త ఝాన్సీ రాణి, శేషం ప్రభారాణి, ఎస్కె మైమున్ అరుణోదయ శ్రీను, షేక్ బాజీ, నాని, హేమ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలతో సహా తండ్రి ఆత్మహత్యాయత్నం


- భార్య కాపురానికి రావడం లేదని భర్త మనస్తాపం
- తనతో పాటు ఇద్దరు పిల్లలకు గడ్డిమందు తాగించిన వైనం



గుంటూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గంగుపల్లి తండాలో విషాదం చోటుచేసుకుంది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ భర్త ఇద్దరు పిల్లలకు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తాగించి, తానూ ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే బొల్లాపల్లి మండలం గంగుపల్లి తండాకు చెందిన చిన్నా నాయక్‌కు అదే గ్రామానికి చెందిన బుజ్జి బాయితో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే చిన్నా నాయక్ తాగుడుకు బానిసకావడంతో గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో బుజ్జి బాయి పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాకపోవడంతో పెద్దలతో కలిసి రాజీ కుదిర్చేందుకు చిన్నా నాయక్ పలుమార్లు యత్నించాడు. కానీ ఫలితం లేకుండా పోయింది. మరోవైపు పిల్లలు తల్లి గురించి తరచూ అడుగుతుండటంతో చిన్నా నాయక్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని చెబుతున్నారు. తాను ఒక్కడే చనిపోతే పిల్లలు అనాథలవుతారని భావించినా చిన్నా నాయక్ వారి ప్రాణాలను కూడా తీయాలని భావించి నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తనతోపాటు ఇద్దరు పిల్లలకు తాగించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెబుతున్నారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించారు. ముగ్గురికి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అయితే ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

# వృద్ధురాలిపై అత్యాచారయత్నం

తిరుపతి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో ఆదివారం దారుణఘటన జరిగింది. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాతయ్య గుంట సమీపంలోని మల్లం గుంటలో ఈ ఘటనలో 80 ఏళ్ల వృద్ధురాలిపై దాడి చేసి గుర్తుతెలియని వ్యక్తులు ఆపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు. వృద్ధురాలు ఒంటరిగా నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దారుణానికి వడిగట్టడంతో పై అంతస్తులో ఉన్న కుమారుడు ఫిర్యాదుతో గాయాలైన ఆమెను ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు, క్లూస్ టీమ్ చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విచారణ చేపడుతున్నారు.



# కళ్యాణీ డ్యామ్‌లోకి దూకి యువకుడు ఆత్మహత్య

చంద్రగిరి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త: మద్యం మత్తులో కళ్యాణీ డ్యామ్‌లోకి దూకిన డ్రైవర్ మురళీమోహన్ (35) మృతి చెందాడు. వివరాల్లోకెళితే.. పుంగనూరుకు చెందిన ముగ్గురు డ్రైవర్లు సుబ్రమణ్యం, గంగరాజు, మురళీ మోహన్ మద్యం మానేందుకు చంద్రగిరి శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ప్రమాణం చేయడానికి బయలుదేరారు. మార్గమధ్యలో కళ్యాణీ డ్యామ్‌ను తిలకించేందుకు వెళ్ళారు. ముగ్గురూ వెళుతుండగా మురళీ మోహన్ అకస్మాత్తుగా డ్యామ్‌లోకి దూకేశాడు. దీంతో భయాందోళనకు గురైన సహచరులు అక్కడి నుండి పారిపోయి పుంగనూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు పోలీసులు చంద్రగిరి సిఐ సురేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. సిఐ సురేష్‌కుమార్, ఎస్ఐ అరుణాచలం తమ సిబ్బందితో డ్యామ్ వద్దకు చేరుకుని గజీతగాళ్ళతో మృతదేహం కొరకు గాలింపు చేపట్టారు. ఆదివారం మృతదేహం లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. మురళీమోహన్ మృతి పట్ల కేసు నమోదు చేసిన పోలీసులు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

